అక్షరభూమి
ద్విభాషా దినపత్రిక
28 శనివారం నవంబర్ 2026

పల్లె, పట్టణం తేడా లేకుండా ఎన్డీఏ కూటమికే ప్రజల పట్టం: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 27, అక్షర భూమి : రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఏకపక్షంగా ఎన్డీఏ కూటమికే పట్టం కట్టారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. వినుకొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిగినా, ఈవీఎంల ద్వారా జరిగినా విజయం కూటమిదేనని ప్రజలు మరోసారి నిరూపించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 94 శాతం స్థానాలను, తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 78 శాతం స్థానాలను కూటమి కైవసం చేసుకుందని ఆయన వెల్లడించారు. ఇది ముమ్మాటికీ నిజమైన ప్రజా విజయమని అభివర్ణించిన ఆయన, ప్రజలిచ్చిన ఈ తీర్పుకు తాము శిరసావహిస్తామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల సమిష్టి కృషితో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలపై నమ్మకంతోనే ప్రజలు కూటమికి అండగా నిలిచారని జీవీ ఆంజనేయులు తెలిపారు.

గత వైసీపీ పాలనలోని విధానాలను ప్రజలు ఏమాత్రం అంగీకరించలేదని, అందుకే పల్లెలు, పట్టణాల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేశారని విమర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు పలు చోట్ల పోటీకి కూడా దూరంగా ఉన్నారని ఆయన ఆరోపించారు.?వినుకొండ నియోజక వర్గ ఫలితాలను ప్రస్తావిస్తూ.. నియోజకవర్గంలోని మొత్తం 119 పంచాయతీలకు గాను సుమారు 98 స్థానాల్లో కూటమి మద్దతుదా రులు ఘన విజయం సాధించారని ఆయన వివరించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంత గ్రామంలోనూ టీడీపీ మద్దతుదారుడే విజయం సాధించారని జీవీ ఆంజనేయులు గుర్తుచేశారు. బొల్లా బ్రహ్మనాయుడు ఇప్పటికైనా గ్రామాల్లో చిచ్చు పెట్టే రాజకీయాలను మానుకుని, తన వైఖరి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

ఆర్.ఎస్.బ్రదర్స్ వారి 22వ గ్రాండ్ షోరూమ్ శుభారంభం







గుంటూరు, నవంబరు 27, అక్షర భూమి : ఫ్యామిలీ షాపింగ్ బ్రాండ్స్‌కు పేరు మోసిన ఆర్.ఎస్.బ్రదర్స్ వారి విజయవంతమైన వ్యాపార ప్రస్థానంలో మరో మైలురాయిని చేరుకుంటూ గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో తమ 22వ గ్రాండ్ షోరూమ్‌కు నవంబరు 27నాడు శుభారంభం చేసుకుంది! గుంటూరు, ఆ పరిసర ప్రాంతాలకు చెందిన వారు కుటుంబంలోని అన్నితరాల షాపింగ్ అవసరాలకు, అభిరుచులకు అనువైన ఈ గ్రాండ్ షాపింగ్ షోరూమ్‌ను ప్రఖ్యాత సినీతార నిధి అగర్వాల్ జ్యోతిని వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "విశ్వసనీయతకు మరోపేరైన ఆర్.ఎస్.బ్రదర్స్ వారు సంప్రదాయానికీ, అధునాతన జీవనశైలికీ ప్రాముఖ్యం ఇస్తూ, పర్వదినాలనూ, వివాహాది శుభకార్యాలనూ దృష్టిలో ఉంచుకుని, కుటుంబంలోని ప్రతీ ఒక్కరి అభిరుచులనూ, అవసరాలనూ ప్రతిబింబించే వైవిధ్యభరిత షాపింగ్‌ను గుంటూరు వాసులకు అందించడం అభినందనీయం" అన్నారు.

టైటిల్ మార్కెటింగ్‌లో తమదైన బ్రాండ్‌ను నెలకొల్పిన ఆర్.ఎస్.బ్రదర్స్ సంస్థను పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి. ప్రసాదరావు, స్వర్గీయ పి.సత్యనారాయణ రావు గార్లు స్థాపించి, సమున్నత స్థాయికి తీసుకువచ్చారు. సంప్రదాయ శైలి మొదలుకుని, అధునాతన విలాసాలను ప్రతిబింబించే వస్త్ర వైవిధ్యాన్ని సరసమైన ధరలలో, విశ్వసనీయమైన నాణ్యతా ప్రమాణాలతో అందించడంలో తమదైన ముద్రను నెలకొల్పారు. 22వ షోరూమ్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు, వినియోగదారులకు ఆర్.ఎస్.బ్రదర్స్ కంపెనీ డైరెక్టర్లు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ది శ్రీ పి. వెంకటేశ్వర్లు (ఫౌండర్ & చైర్‌పర్సన్): "గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో మా 22వ స్టోర్‌ను నెలకొల్పడం మాకు ఎంతో ఆనందదాయకం. దశాబ్దాలపాటు షాపింగ్ ప్రియులకు సేవలందిస్తూ, మా సంస్థ మరింతగా విస్తరించడంలో మా కస్టమర్ల ఆదరాభిమానాలు మరువలేనివి. అన్ని తరాలవారూ, తరగతుల వారూ తమ కుటుంబాలకు కావలసిన షాపింగ్ అవసరాలను, సరసమైన ధరలకు, సరిసాటిలేని నాణ్యతతో ఒకేచోట సమకూర్చడం ద్వారా ఆర్.ఎస్.బ్రదర్స్ ఎప్పుడూ అగ్రశ్రేణిలోనే ఉంటుంది." ఎస్. రాజమౌళి (ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్): "గుంటూరులోని మా సరికొత్త షోరూమ్‌లో వైవిధ్యభరితమైన శ్రేణులలో వస్త్రాలు లభిస్తున్నాయి. రాబోయే క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి పర్వదినాలతో పాటు అన్నిరకాల శుభకార్యాలకు, వేడుకలకు అనువైన వెరైటీ వస్త్రాలను, సరికొత్త డిజైన్లలో గుంటూరువాసులకు మేము అందుబాటులో ఉంచాము." ది శ్రీ టి. ప్రసాదరావు (ఫౌండర్ & హోల్-టైం డైరెక్టర్): "ఆంధ్రుల రాజధాని అమరావతికి చేరువలో అనునిత్యం విస్తరిస్తున్న గుంటూరు నగరంలోని అన్ని కుటుంబాల వారికీ సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించాలన్న సంకల్పంతో ఈ 22వ స్టోర్‌ను నెలకొల్పాము. రాబోయే పండగల కోసం మీ కుటుంబంలోని అన్నితరాల వారికీ అనువైన షాపింగ్ కోసం మా వద్దకు విచ్చేయండి. మీకు నచ్చిన ఫెస్టివ్ కలెక్షన్స్‌ను ఎంపిక చేసుకోండి." రానున్న పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పూర్తి కుటుంబ అవసరాలకు అనుగుణంగా, సరసమైన ధరలలో ఆర్.ఎస్.బ్రదర్స్ అందిస్తున్న ప్రత్యేక కలెక్షన్లు

ది మహిళల కోసం: అందమైన కంచి పట్టుచీరెలు, ఫ్యాన్సీ చీరెలు, భారతదేశ వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందిస్తున్న కళాత్మక సమర్పణలు, పెళ్లి కుమార్తెకు వన్నెతెచ్చే వైవిధ్యభరిత సంప్రదాయ వస్త్రాలు

ది పురుషుల కోసం : అద్భుతమైన డిజైనర్ కుర్తాలు, సాంప్రదాయిక ఎథ్నిక్ వస్త్రాలు, ఫార్మల్ సూట్స్, అధునాతన కాజువల్ ష్లేల్స్

ది చిన్నారుల కోసం: ఆకర్షణీయమైన అందాల రంగుల్లో ఆకట్టుకునే ట్రెండీ ఫెస్టివల్ సూట్స్

ఆర్.ఎస్.బ్రదర్స్ గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులో నెలకొల్పిన తమ 22వ షోరూమ్‌కు విచ్చేసి, రాబోయే క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పర్వదినాలకు కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులకు సరిపోయే వస్త్రవిశేషాలను కొనుగోలు చేయగలరని, ఆశిస్తూ, గుంటూరులోని ప్రతీ గృహానికీ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు.

మాతృ మరణాలను నివారించడమే ప్రధాన లక్ష్యం : డిఎంహెచ్వో

గుంటూరు, నవంబర్ 27. అక్షర భూమి : గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ యం. పద్మావతి అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి మాతృ మరణాల నిఘా మరియు ప్రతిస్పందన కమిటీ సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లాలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,పాత గుంటూరు పరిధిలో గత నెలలో నమోదైన మాతృ మరణానికి సంబంధించిన కేసును సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా గర్భిణులకు అందించిన వైద్య సేవలు, ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో మరియు ప్రసవానంతరం తీసుకున్న వైద్య చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో అందించిన చికిత్స, అసుపత్రులకు తరలింపు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ వో డాక్టర్ యం. పద్మావతి మాట్లాడుతూ, మాతృ మరణాలను నివారించడం ఆరోగ్య శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి మాతృ మరణాన్ని తీవ్రంగా పరిగణించి, దానికి దారితీసిన కారణాలను గుర్తించి, భవిష్యత్తులో అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం అందించే ఉన్నత స్థాయి అసుపత్రులకు సకాలంలో రిఫర్ చేయాలని అదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి నుంచి జిల్లా స్థాయి అసుపత్రుల వరకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. మాతృ మరణాల నివారణలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, పబ్లిక్ హెల్త్ నర్సులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి గర్భిణి నమోదు నుంచి ప్రసవం, ప్రసవానంతర అరు వారాల వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో డాక్టర్ రంగారావు డి సి హెచ్ ఎస్,జిల్లా ప్రోగ్రాం వైద్యాధికారులు ఈ. అన్నపూర్ణ, కె.సుజాత, యం. ఝాన్సీ బాయి, కె.ప్రియాంక ,ప్రభుత్వ జనరల్ అసుపత్రి గుంటూరు వైద్య నిపుణులు వి. అరుణ,పి. రామారావు , ఇంద్రాణి, అదిత్య ప్రదీప్ రెడ్డి, శ్రీవిద్య,జి. భవాని, పి. రాధిక రాయుడు, ప్రియాంక, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి,యు పి హెచ్ సీ యం ఓ కరిష్మా, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారిణి ప్రసూన,సంబంధిత ప్రైవేట్ వైద్యులు, శ్రీధర్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు,వైద్య సిబ్బంది , అశాలు, ఆరోగ్య కార్యకర్తలు, కేసుకి సంబంధించిన బంధువులు పాల్గొన్నారు.



ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నివారణపై CAHO ఆధ్వర్యంలో జవీజు సదస్సు

- రోగుల భద్రత, నాణ్యమైన వైద్య సేవలపై వైద్యులకు అవగాహన



గుంటూరు, నవంబరు 27, అక్షర భూమి : ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నివారణ, రోగుల భద్రత, నాణ్యమైన వైద్య సేవలపై అవగాహన కల్పించేందుకు CAHO (సెంటర్ ఫర్ అక్రిడిటేషన్ ఆఫ్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్స్), లలితా PVS ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా జవీజు సదస్సును నిర్వహించాయి. 'బ్రేక్ ద చైన్, సేవ్ లైవ్స్ -- బిల్డింగ్ సేఫర్ హెల్త్‌కేర్ టుగెదర్' నినాదంతో లలితా PVS ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది.లలితా గ్రూప్ చైర్మన్ డాక్టర్ పి.వి. రాఘవ శర్మ, జజ్ఞూ డాక్టర్ పి. అనురాగ్, డాక్టర్ బి. స్రవంతి బైరపనేని కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ రాయపాటి మమత ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి.వి. రాఘవ శర్మ మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ల నివారణ ఒక్క విభాగం బాధ్యత మాత్రమే కాదని, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సహా ప్రతి ఒక్కరూ సమష్టిగా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. డాక్టర్ బి. స్రవంతి మాట్లాడుతూ ఇన్ఫెక్షన్లు వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందుగానే వాటిని నివారించడం, వ్యాప్తిని అరికట్టడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.సదస్సులో నర్సింగ్ సిబ్బంది పాత్ర, మైక్రోబయాలజీ, యాంటీబయాటిక్స్ వినియోగం, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, ఆసుపత్రుల్లో వచ్చే ఇన్ఫెక్షన్ల నియంత్రణ, నాణ్యతా ప్రమాణాలపై వైద్య నిపుణులు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఆసుపత్రులకు చెందిన సుమారు 200 మంది వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, మైక్రోబయాలజిస్టులు, ఇన్ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ విభాగాల ప్రతినిధులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం ప్రతి సమస్యకు త్వరిత పరిష్కారం : జిల్లా ఎస్పీ



గుంటూరు, నవంబర్ 27. అక్షర భూమి. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లు, దబల్యూ ఎం ఎస్ కే విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది నుంచి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు తదితర అంశాలపై వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతులను స్వయంగా పరిశీలించి, పోలీస్ శాఖ నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో సామర్థ్యం, ఉత్సాహం పెరుగుతాయని ఎస్పీ తెలిపారు. సిబ్బంది తమ సమస్యలను సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది క్రమశిక్షణ,సమయపాలన, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలతో మర్యాదగా మెలగాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా సేవలందించాలని పేర్కొన్నారు. "పోలీస్ శాఖ ఒక కుటుంబం. సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది"అని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, తెలియజేసారు.

డాక్టర్ మంగాదేవి సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, నవంబర్ 27. అక్షర భూమి. విద్యార్థుల భవిష్యత్తుకు ఆశాజ్యోతిగా నిలిచిన డాక్టర్ మంగాదేవి సేవలు చిరస్మరణీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గుంటూరు విద్యారంగంలో విశేష సేవలందించిన శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ నన్నపనేని మంగాదేవి శుక్రవారం చోడవరంలోని చేతన ఫౌండేషన్ ఆవరణలో కన్నుమూయడం పట్ల గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే & టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చోడవరంలోని చేతన ఫౌండేషన్‌కు చేరుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రముఖ విద్యావేత్తగా, విద్యారంగంలో విశేష సేవలందించిన మంగాదేవి తెనాలి ప్రాంత ప్రజలకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమందికి సుపరిచితులన్నారు. విద్య, పిల్లల భవిష్యత్తు కోసం ఆమె చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. సాధారణంగా ప్రతి ఒక్కరూ తమ కుటుంబం, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇస్తారని, కానీ మంగాదేవి మాత్రం తన జీవితాన్ని పూర్తిగా సమాజానికి అంకితం చేసి, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేశారని అన్నారు. ఎందరో విద్యార్థులకు, పేద కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి మంగాదేవని కొనియాడారు. ఆమె అందించిన సేవలు అపారమని, సమాజానికి ఆమె చేసిన సేవలను ఎప్పటికీ మరువలేమని పేర్కొన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. బాలకుటీర్ విద్యాసంస్థలను ఎలాంటి లాభాపేక్ష లేకుండా, విద్యారంగంలో ఎన్నో పోటీలు ఉన్నప్పటికీ తమ విలువలు, ఆశయాలకు కట్టుబడి నిర్వహించడం మంగాదేవి ప్రత్యేకత అని తెలిపారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, ఎలాంటి ఒత్తిడి లేని విద్యను అందించాలనే సత్సంకల్పంతో ఆమె పనిచేశారని, ఆ విధానంతోనే ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేశారని అన్నారు.మంగాదేవి చూపిన మార్గం, ఆమె నెలకొల్పిన విద్యా విలువలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, ఆమె ఆశయాలను కొనసాగిస్తూ బాలకుటీర్ విద్యాసంస్థలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో విద్యాసంస్థలను స్థాపించాలనుకునే వారు, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనుకునే వారు మంగాదేవిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమెని అభిమానించే ఎంతోమంది చివరి చూపు కోసం తరలివచ్చి నివాళులర్పించడం చూస్తుంటే, వారందరి అభిమానంలో మంగాదేవి సజీవంగా కనిపిస్తున్నారన్నారు. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, సమాజానికి అందించిన సేవలు, విద్యారంగంలో వేసిన అడుగుజాడలు ఎప్పటికీ నిలిచిపోతాయని పేర్కొంటూ, మంగాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కూటమితో రాష్ట్ర సమగ్రాభివృద్ధి : చీరాల, పెదకాకానిలో ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం



గుంటూరు, నవంబర్ 27. అక్షర భూమి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం అయన బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో ఎమ్మెల్యే కొండ య్య, పొన్నూరు నియోజకవర్గం పరిధిలోని పెదకాకాని మండలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటిం టికీ ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న చారిత్రాత్మక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తూ తల్లుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు మళ్లీ పట్టాలెక్కాయని తెలిపారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే దుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, తద్వారా యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిప దికన పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. మైనారిటీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుం దన్నారు. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాలు, విద్యార్థు లకు విదేశీ విద్యా పథకం, షాదీఖానాల నిర్మాణం, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల చెల్లింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేత: ఏఈ వెంకటేశ్వర నాయక్

మాచర్ల, నవంబర్27(అక్షరభూమి): నేడు మాచర్ల మండలం రూరల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు ఏఈ వెంకటేశ్వర నాయక్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ ప్రాంతాలైన రాయవరం, కంభంపాడు, ముత్యాలంపాడు, గోపాలపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ బోర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్డిఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. పనుల అనంతరం తిరిగి విద్యుత్ సరఫరా కొనసాగుతుందన్నారు. రూరల్ ప్రాంతాల ప్రజలందరూ విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.